TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 31 శనివారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 171 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను

తెలంగాణ మంజీరా

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న

తెలంగాణ మంజీరా

మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.

98496 38320

రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను

కాపాడాం...

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

“ మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ.50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు, మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే. ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ”

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్‌ను ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు.

...మిగతా 2 లో...

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా..

మళ్లీ మారిన షెడ్యూల్

- ఏపీ, తెలంగాణలో మళ్లీ మారిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ షెడ్యూల్
- రెండు రాష్ట్రాల్లోనూ నవంబర్ 30న ఓటర్ల తుది జాబితా వెల్లడి
- సీఈవోల విజ్ఞప్తి మేరకు షెడ్యూల్‌ను మార్చిన కేంద్ర ఎన్నికల సంఘం
- తెలంగాణలో నవంబర్ 26, ఏపీలో నవంబర్ 20 వరకు పొడిగించిన అభ్యంతరాల గడువు

తెలంగాణలో 2.59 కోట్లు, ఏపీలో 42.55 లక్షల ఓటర్ల పేర్లకు తుది జాబితాలో చోటు

రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమ షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) మరోసారి మార్పు చేసింది. రెండు రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవోలు) విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. తాజా మార్పులతో రెండు రాష్ట్రాల్లోనూ ఓటర్ల తుది జాబితా నవంబర్ 30వ తేదీన ప్రచురితం కానుంది.ఈ మేరకు ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల సీఈవోలకు వేర్వేరుగా సమాచారం అందించింది. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులపై వచ్చిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారానికి సంబంధించిన గడువును తెలంగాణలో నవంబర్ 26 వరకు, ఆంధ్రప్రదేశ్‌లో నవంబర్ 20 వరకు పొడిగించింది. వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నవంబర్ 9న, ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 30నే తుది జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రక్రియ ఇంకా పూర్తి కాకపోవడంతో సీఈవోల అభ్యర్థన మేరకు ఈసీ గడువును పొడిగించింది.సవరించిన షెడ్యూల్ వివరాలను క్షేత్రస్థాయి అధికారులందరికీ తెలియజేయాలని, మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఈసీ తమ ఆదేశాల్లో స్పష్టం చేసింది. ...మిగతా 2 లో...

నిలేక తిరుగుతున్నానా? .. రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను: ఈటల రాజేందర్

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర
- ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక
- నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్
- డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని ఆయన హెచ్చరించారు. పని లేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. ...మిగతా 2 లో...

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి
- రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి
- విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు.

...మిగతా 2 లో...

కన్నడిగులకే ఉద్యోగాలు..

కర్ణాటకలో ఐటీ కంపెనీలపై ఒత్తిడికి కరవే పిలుపు

- ఐటీ, బీటీ కంపెనీలలో కన్నడిగులకు ఉద్యోగాల కోసం ఉద్యమం
- నవంబర్ 1 నుంచి నెల రోజుల పాటు కరవే ఆందోళన
- స్థానిక నియామకాలపై కంపెనీల నుంచి వివరాల సేకరణ
- కన్నడిగులకు అన్యాయం చేస్తే చర్యలు తప్పవన్న సీఎం శివకుమార్

కర్ణాటకలోని ఐటీ, బయోటెక్నాలజీ (బీటీ) కంపెనీలలో కన్నడిగులకు ఉద్యోగావకాశాలు పెంచాలన్న డిమాండ్‌తో కన్నడ అనుకూల సంస్థ 'కర్ణాటక రక్షణ వేదిక' (కరవే) ఉద్యమానికి పిలుపునిచ్చింది. నవంబర్ 1న కర్ణాటక రాజ్యోత్సవం సందర్భంగా ఈ ఆందోళన ప్రారంభించి, నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా కొనసాగించనున్నట్లు ప్రకటించింది.ఈ కార్యక్రమంలో భాగంగా, కరవే పలు బృందాలను ఏర్పాటు చేయనుంది. ఒక్కో బృందంలో 10 మంది నాయకులు, కార్యకర్తలు ఉంటారు.

...మిగతా 2 లో...

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర..

24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

- ఉద్యోగం కోరుతూ సైగలతో విన్నవించుకున్న దివ్యాంగ యువకుడు
- తక్షణమే స్పందించి హామీ ఇచ్చిన తమిళనాడు సీఎం విజయ్
- కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులు
- నియామక పత్రాన్ని స్వయంగా అందజేసిన ముఖ్యమంత్రి
- సీఎం విజయ్ చొరవపై సర్వత్రా ప్రశంసల వెల్లువ

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, ఓ దివ్యాంగ నిరుద్యోగి పట్ల మానవతా దృక్పథంతో స్పందించారు. ఉద్యోగం ఇప్పించాలని సైగలతో వేడుకున్న యువకుడికి కేవలం 24 గంటల్లోనే ప్రభుత్వ ఉద్యోగం కల్పించి తన హామీని నిలబెట్టుకున్నారు. ...మిగతా 2 లో...

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది.. ఐడీబీఐ వాటాల విక్రయంపై రాహుల్‌కు నిర్మలా కౌంటర్

మొదటిపేజీ తరువాయి

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు. బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు. ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు. 2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు. ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

కొలువు కోసం సైగలతో దివ్యాంగుడి మొర..

24 గంటల్లో ఉద్యోగం కల్పించిన సీఎం విజయ్

మొదటిపేజీ తరువాయి

ఇచ్చిన మాటను వెంటనే అమలు చేసిన ఈ ఘటనపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.వివరాల్లోకి వెళితే.. చెన్నై గిండిలోని ప్రభుత్వ వృత్తివిద్యా శిక్షణ సంస్థలో బుధవారం జరిగిన ఓ కార్యక్రమానికి సీఎం విజయ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దినేశ్ అనే దివ్యాంగ యువకుడు సీఎంను కలిసి, తాను నిరుద్యోగినని, జీవనం కష్టంగా ఉందని సైగలతో వివరిస్తూ ఓ వినతిపత్రాన్ని అందించాడు. అతని పరిస్థితిని అర్థం చేసుకున్న విజయ్, తప్పకుండా సాయం చేస్తానని అక్కడికక్కడే భరోసా ఇచ్చారు.అనుకున్నదే తడవుగా, మరుసటి రోజైన గురువారం ఉదయం దినేశ్‌ను సచివాలయానికి పిలిపించారు. అక్కడ సీఎం విజయ్ స్వయంగా దినేశ్‌తో కరచాలనం చేసి, ఉద్యోగ నియామక పత్రాన్ని అందజేశారు. తిరువొత్తియూరులోని ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో సహాయకుడి పోస్టును కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.విజ్ఞప్తి చేసిన ఒక్క రోజులోనే ఉద్యోగం రావడంతో దినేశ్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. తన కష్టాన్ని అర్థం చేసుకుని తక్షణమే స్పందించిన సీఎం విజయ్‌కు అతడు కృతజ్ఞతలు తెలిపాడు. ప్రజాప్రతినిధులు సమస్యలపై వెంటనే స్పందించాలనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణగా నిలిచింది.

కన్నడిగులకే ఉద్యోగాలు..

కర్ణాటకలో ఐటీ కంపెనీలపై ఒత్తిడికి కరవే పిలుపు

మొదటిపేజీ తరువాయి

వీరు రాష్ట్రంలోని ఐటీ, బీటీ కంపెనీలను సందర్శించి, యాజమాన్యాలు, హెచ్ఆర్ అధికారులతో సమావేశమవుతారు. కంపెనీలో ఎంతమంది కన్నడిగులు పనిచేస్తున్నారు, స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు ఎలాంటి విధానాలు పాటిస్తున్నారు, అర్హత ఉన్నప్పటికీ కన్నడిగులకు ఎందుకు అవకాశాలు దక్కడం లేదనే అంశాలపై వివరణ కోరుతూ విజ్ఞాపన పత్రాలు సమర్పిస్తారు.కర్ణాటక భూమి, నీరు, మౌలిక సదుపాయాలను వాడుకుంటున్న కంపెనీలు స్థానికుల ఉద్యోగ ఆకాంక్షలను గౌరవించాలని కరవే స్పష్టం చేసింది. ఐటీ రంగంలో కన్నడిగులు సమర్థులైనప్పటికీ వారికి తగిన అవకాశాలు ఇవ్వడం లేదని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో స్థానిక ఉద్యోగులు, నిరుద్యోగుల నుంచి కూడా ఫిర్యాదులు స్వీకరించనున్నారు.ఈ అంశంపై కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇటీవలే స్పందించారు. బెంగళూరులోని ఐటీ కంపెనీలు కావాలనే కన్నడిగులను ఉద్యోగాలకు దూరంగా ఉంచుతున్నాయనే ఫిర్యాదులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని అక్టోబర్ 25న ఆయన హెచ్చరించారు. స్థానికులకు అన్యాయం జరుగుతున్నట్లు తేలితే ప్రైవేట్ సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని, కన్నడిగుల హక్కులు, ఉద్యోగావకాశాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

మూసీ ప్రక్షాళనకు మేము వ్యతిరేకం కాదు: రాంచందర్ రావు

మొదటిపేజీ తరువాయి

ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

నాగర్ కర్నూల్ జిల్లాలో కరువు పరిస్థితులపై కలెక్టర్ సమీక్ష

నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి: తెలంగాణ మంజీరా అక్టోబర్ 30

నాగర్ కర్నూల్ జిల్లాలో 13 మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కరువు పరిస్థితులపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ చేయాలి బోర్లు, చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ల పరిస్థితిని పరిశీలించాలి నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించాలి అవసరమైన గ్రామాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లు చేయాలి వ్యవసాయ, ఉద్యాన శాఖలు పంటల నష్టంపై సమగ్ర అంచనా వేయాలి సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలపై నిరంతర పరిశీలన చేయాలి రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత సమయంలో నివేదికలు సమర్పించాలి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

బాలల భద్రతకు చట్టాలపై అవగాహనే రక్షణ కవచం

హుజురాబాద్ టౌన్, అక్టోబర్ 30 తెలంగాణ మంజీరాః

బాలలపై జరిగే లైంగిక వేధింపులను అరికట్టడంతో పాటు, వారి హక్కులకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆల్ఫోర్స్ జీనియస్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుల్లో సీనియర్ సివిల్ జడ్జ్ పి.బి కిరణ్ కుమార్ హుజురాబాద్ చట్టం పైన అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పోక్సో చట్టం ప్రాముఖ్యతను వివరిస్తూ, మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను, అసభ్య ప్రవర్తనను గుర్తించే విధానాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, లైంగిక వేధింపులకు పాల్పడినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాలలపై లైంగిక నేరాలకు పాల్పడటం చట్టరీత్యా శిక్షార్హమని, ఇలాంటి ఘటనలను దాచిపెట్టకుండా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.ప్రతి విద్యార్థి తన హక్కులను తెలుసుకోవడంతో పాటు వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, అపరిచిత వ్యక్తులతో ఆన్‌లైన్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని తెలిపారు. బాలలపై లైంగిక నేరాలను నిరోధించేందుకు, బాధిత బాలబాలికలకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని వివరించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిలేక తిరుగు తున్నానా? .. రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను: ఈటల రాజేందర్

మొదటిపేజీ తరువాయి

"డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాద యాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

నవంబర్ 30న ఏపీ, తెలంగాణ ఓటర్ల తుది జాబితా..

మళ్లీ మారిన షెడ్యూల్

మొదటిపేజీ తరువాయి

అదేవిధంగా మార్పు చేసిన షెడ్యూల్ గురించి రాజకీయ పార్టీలకు కూడా రాతపూర్వకంగా సమాచారం అందించాలని సూచించింది. గణాంకాల వివరాలు ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రారంభానికి ముందు తెలంగాణలో 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,64,87,213 మంది మాత్రమే తమ వివరాలను నమోదు చేసుకున్నారు. మిగిలిన 73,39,235 మంది ఓటర్లను వలస వెళ్లినవారు, మరణించినవారు, చిరునామా మారినవారు, నకిలీ ఓట్ల కేటగిరీ కింద గుర్తించి డ్రాఫ్ట్ జాబితా నుంచి తొలగించారు. అక్టోబర్ 29 నాటికి అందిన సమాచారం ప్రకారం.. తెలంగాణలో జారీ చేసిన 92,88,188 నోటీసులకు గానూ 92,81,189 నోటీసులు ఓటర్లకు అందజేశారు. వీటిలో 92,08,443 నోటీసులపై విచారణ పూర్తయింది. ఇప్పటివరకు మొత్తం 2,59,22,684 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి అధికారులు ఆమోదం తెలిపారు. వీరిలో 59,31,395 మంది ఓటర్ల విషయంలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించారు. మరో 30,64,168 మందిని 2002 నాటి జాబితా నుంచి మ్యాపింగ్ చేశారు. విచారణ అనంతరం 50,690 మంది ఓటర్లు జాబితాలో చేరడానికి అర్హులు కారని అధికారులు తేల్చారు. ఇక, ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి 44,28,858 నోటీసులపై విచారణ పూర్తయింది. వీరిలో 42,55,630 మంది ఓటర్ల పేర్లను తుది జాబితాలో చేర్చడానికి ఆమోదం లభించింది. పరిశీలన తర్వాత 1,73,662 మంది ఓటర్లు జాబితాలో చోటు దక్కించుకోవడానికి అర్హులు కారని అధికారులు నిర్ధారించారు.

ఆదివాసీల హక్కులను గౌరవించాలి.. అడవుల సంరక్షణ అందరి బాధ్యత : డి.ఎఫ్.ఓ బాలమణి

ఆసిఫాబాద్, అక్టోబర్ 30 తెలంగాణ మంజీరా

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో డీ,ఎఫ్,ఓ బాలమణి ఆదివాసీ హక్కుల పోరాట సమితి 'తుడుందెబ్బ' ముఖ్య నాయకుల ప్రత్యేక సమావేశం సౌహార్ద్ర వాతావరణంలో జరిగింది. ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ శాఖ నిబంధనలు, ఆదివాసీల హక్కులు, క్షేత్రస్థాయి సమస్యలు, అటవీ సంరక్షణపై సుదీర్ఘంగా చర్చించారు. ఆదివాసీల చట్టాలను గౌరవించాలి: తుడుందెబ్బ ఈ సందర్భంగా తుడుందెబ్బ నాయకులు మాట్లాడుతూ.. లిఏజెన్సీ ప్రాంతాలలో అటవీ శాఖ అధికారులు 1/70 చట్టం, పెసా (గ్రాజుూూా) చట్ట నిబంధనలను తప్పనిసరిగా గౌరవించాలి. లిఆదివాసీ గ్రామాలలో సీసీ రోడ్లు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిబంధనల పేరిట అడ్డుకోవద్దు. తరతరాలుగా అడవులను కాపాడుతున్న ఆదివాసీలను వేధించవద్దు. సంస్కృతి, సాంప్రదాయ పండుగల పూజా కార్యక్రమాలకు అవసరమైన కట్టెలు తెచ్చుకునే విషయంలో ఇబ్బంది పెట్టవద్దు. లిఏజెన్సీ పరిధిలోని అటవీ శాఖ నియామకాలు, కాంట్రాక్టు పనుల్లో స్థానిక ఏజెన్సీ ఆదివాసీలకే ప్రాధాన్యత కల్పించాలి. ఆదివాసీలకు అన్యాయం జరగనంత కాలం అటవీ పరిరక్షణలో అటవీ శాఖకు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. సాంప్రదాయాలకు అడ్డంకులు ఉండవు : డీ,ఎఫ్,ఓ తుడుందెబ్బ నాయకుల విజ్ఞప్తులపై డి,ఎఫ్,ఓ బాలమణి సానుకూలంగా స్పందిస్తూ.. ఆదివాసీల సంస్కృతి, పండుగల విశిష్టత తమకు తెలుసని, దైవ కార్యక్రమాలకు అవసరమైన కట్టెలకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. వెదురు బొంగులను శాస్త్రీయ పద్ధతిలో కత్తిరించడం వల్ల నాలుగు రెట్లు ఉత్పత్తులు పెరుగుతాయని, నిర్దేశిత పరిమితి మేరకే జరగాలని సూచించారు. అటవీ సంపదను వ్యాపార కార్యకలాపాలకు తరలించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వల్ల ఇబ్బందులు తలెత్తితే తక్షణమే తనకు ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని, విచారణ చేపట్టి న్యాయం చేస్తామన్నారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జాతీయ అధ్యక్షులు కోట్నాక విజయ్ కుమార్, జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్, ముఖ్య సలహాదారు కనక ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోర్ మారుతీ, ఉపాధ్యక్షులు కొట్నక రాంశావ్, వెడ్మ భగవంత్ రావ్, జిల్లా కార్యదర్శి సిడాం నాగోరావు, లింగాపూర్ మండల అధ్యక్షులు పెంధోర్ ప్రకాష్, తీర్యాణి మండల విద్యార్థి సంఘం అధ్యక్షులు రాయ్ సిడాం జంగు, నాయకులు ఆడె సోమేష్, మడావి పురుషోత్తం, కోట్నాక వినేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ మధు గౌడ్ సహాయంతో ఆలయం పునర్నిర్మాణం

ఆర్ మధుగౌడ్ తన సహాయంతో ఆలయాభివృద్ధికి కృషి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

దేవస్థానంలో శ్రీ నవరత్నలయ దేవస్థాన పునరుద్ధరణ కమిటీ ఆధ్వర్యంలో రుద్రారం మధు గౌడ్ సహాయంతో నూతన గోశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభించారు. పంచముఖ హనుమాన్, అయ్యప్ప స్వామి దేవాలయం పుణనిర్మాణం చేయడంతో ఆలయ అభివృద్ధికి డ్రీమ్ సర్వీస్ అధినేత ఆర్.మధుగౌడ్ తన సోంత నిధులతో ఆలయ నిర్మా ణానికి కృషి చేస్తున్నారు. ఆలయ పునర్ని ర్మాణానికి పాత దేవాలయ స్లాబ్ తొలగిస్తూ పనులు ప్రారంబించారు. పట్టణ ప్రజలకు డ్రీమ్ సర్వీస్ అధినేత ఆర్. మధు గౌడ్ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో ఉన్న నవరత్న ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయం అందించారు. ఆలయ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆయన సహకారం అందించడం స్థానికుల్లో సంతోషాన్ని కలిగించింది. పట్టణ ప్రజల సౌకర్యాల కోసం కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణా అభివృద్ధి పనులకు పూజ చేస్తున్న మధుగౌడ్

తారా కళాశాలలో పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

తారా ప్రభుత్వ కళాశాల సంగారెడ్డిలో డిగ్రీ విద్యార్థులకు బోధించుటకు వివిధ విభాగాలలో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడం జరుగుతున్నదని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.ప్రవీణ తెలిపారు. తారా కళాశాలలో బీ.బి.ఏ. లో ఒకటి, ఆంగ్లంలో రెండు, పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆయా పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కనీసం 55శాతం మార్కులతో పాసై ఉండాలని, ఎస్సీ ,ఎస్టీ, అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని, అనుభవం, నెట్, స్లేట్, పీహెచ్డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తారా కళాశాలలో నవంబర్ 02 వ తేదీన జరిగే డెమో మరియు ఇంటర్వ్యూ కు ఒరిజినల్ సర్టిఫికెట్లు మరియు ఒక జిరాక్స్ సెట్ కాపీల తో అటెండ్ కావాలని పేర్కొన్నారు.

కల్వచర్ల జడ్పీహెచ్ఎస్ లో న్యాయ విజ్ఞాన సదస్సు.

కమాన్ పూర్/ రామగిరి తెలంగాణ మంజీరా అక్టోబర్ 30.

మండల న్యాయ సేవా సమితి, మంథని ఆధ్వర్యంలో రామగిరి మండలం కల్వచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మంథని కోర్టు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.సుధారాణి , ద్వితీయశ్రేణి న్యాయమూర్తి బి.అనురాధ , మంథని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.రఘోత్తమ్ రెడ్డి , న్యాయవాదులు శశిభూషణ్ కాచే , బండ మాధురి , రామగిరి పోలీస్ అధికారి ఈదునూరిస్వామి , ప్రభుత్వ పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఆడెపు రవి లతో పాటు గ్రామ సర్పంచ్ రేండ్ల శారద – కుమారస్వామి పాల్గొని విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు బాలల హక్కులు, బాల్య వివాహాల నిర్మూలన చట్టం, పోక్సో చట్టం, బాల కార్మిక వ్యవస్థ, సైబర్ నేరాలు, సోషల్ మీడియా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఉచిత న్యాయ సహాయం పొందే విధానం గురించి వివరంగా తెలియజేశారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండటం వల్ల తమను తాము రక్షించుకోవడమే కాకుండా సమాజంలో జరిగే అన్యాయాలను అడ్డుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

విద్యార్థుల కళా ప్రతిభకు “సాధన 2026”వేదిక

సంగీతం, నృత్యం,నాటకం, దృశ్య కళల్లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

సృజనాత్మకత, నైపుణ్యాలు, అభ్యసన ప్రగతిని చాటిన గీతం విద్యార్థులు

పటాన్‌చెరు, తెలంగాణ మంజీరా న్యూస్ :

విద్యార్థుల్లో దాగి ఉన్న కళా ప్రతిభను వెలికితీస్తూ, వారి సృజనాత్మకతకు వేదికగా ‘సాధన 2026’ నిలిచింది. హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు చెందిన లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం డాన్స్ స్టూడియోలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఐచ్ఛిక కోర్సుల్లో భాగంగా కర్ణాటక సంగీతం, భరతనాట్యం, కూచిపూడి, నాటకం, దృశ్య కళలను అభ్యసిస్తున్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. అధ్యాపకుల మార్గదర్శకత్వంలో బృందాలుగా ఏర్పడిన విద్యార్థులు శిక్షణ ద్వారా నేర్చుకున్న నైపుణ్యాలు, కళాత్మక భావాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. సంగీత ప్రదర్శనలకు మృదంగంపై చంద్రకాంత్, వయోలిన్‌పై వాసు శాస్త్రి సహకారం అందించారు.ప్రత్యక్ష వాయిద్య సహకారంతో వేదికపై ప్రదర్శనలు ఇచ్చే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమ ప్రత్యేకతగా నిలిచింది. తద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సంగీత సమన్వయం, గాత్ర, నృత్య ప్రదర్శనలకు అవసరమైన నైపుణ్యాలు మెరుగుపడ్డాయి.విద్యార్థులు ప్రేక్షకుల ముందు తమ కళాత్మక సామర్థ్యాలను ప్రదర్శించేందుకు సాధన 2026 మంచి అవకాశంగా నిలిచింది. మధ్యంతర మూల్యాంకనంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల అభ్యసన ఫలితాలు, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలు, ప్రదర్శన సామర్థ్యాలను అంచనా వేసేందుకు అవకాశం కలిగింది. విద్యార్థుల అంకితభావం, ఉత్సాహం, కళాత్మక ఎదుగుదలపై అధ్యాపకులు, తోటి విద్యార్థులు ప్రశంసలు కురిపించారు.అనుభవపూర్వక అభ్యసనానికి, కళాత్మక నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ వర్ధమాన కళాకారులను ప్రోత్సహించడంలో గీతం విశ్వవిద్యాలయం నిబద్ధతను సాధన 2026 మరోసారి చాటిచెప్పింది.

రైతు మట్టిని నమ్ముకుంటే.. నాయకులు మట్టిని అమ్ముకుంటున్నారా?

పట్టా, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా మట్టి తవ్వకాలు!

రాత్రివేళల్లో పరిశ్రమలు, వెంచర్లకు అక్రమ రవాణా..

ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.100 వసూలు చేస్తున్నారనే ఆరోపణలు

అధికార, ప్రతిపక్ష నాయకుల అండతోనే మట్టి వ్యాపారమా?

అధికారుల పర్యవేక్షణ ఏదీ?

కొండాపూర్, తెలంగాణ మంజీరా న్యూస్ :

కొండాపూర్ మండలంలో మట్టి వ్యాపారం కొత్త రూపం దాల్చిందా? రైతులు తమ భూములను నమ్ముకుని వ్యవసాయం చేస్తుంటే.. కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు మాత్రం భూముల్లోని మట్టినే వ్యాపారంగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టా భూములు, ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూముల నుంచి అనుమతులు లేకుండానే మట్టిని తవ్వి రాత్రివేళల్లో పరిశ్రమలు, వెంచర్లకు తరలిస్తున్నారనే ఫిర్యాదులు కలకలం రేపుతున్నాయి.

మైనింగ్ అనుమతి రాయికే.. మట్టికి అనుమతి ఉందా?

మల్లేపల్లి శివారులోని సర్వే నంబర్ 300లో ఉన్న పట్టా భూమి, తేర్పోల్ శివారులోని సర్వే నంబర్ 34లో ఉన్న ప్రభుత్వ భూమి పక్కపక్కనే గుట్టలుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో పలుగు రాయి తవ్వకాలకు మైనింగ్ అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. రాయి వెలికితీసే క్రమంలో తొలగిస్తున్న మట్టిని తరలించేందుకు ప్రత్యేక అనుమతులు ఉన్నాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. గుట్టల వద్ద పేరుకుపోయిన మట్టిని చుట్టుపక్కల పరిశ్రమలు, వెంచర్లకు రాత్రివేళల్లో తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ట్రిప్పుకు రూ.100 ఇవ్వాల్సిందేనా?

మట్టి తరలింపులో కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు మరింత చర్చనీయాంశంగా మారాయి. ఓ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ట్రాక్టర్ ప్రతి ట్రిప్పుకు రూ.100 చెల్లించాలని, లేదంటే మట్టి తరలించనివ్వబోమని చెప్పినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. గతంలో పొలాలకు వెళ్లేందుకు మట్టితో రహదారి వేయించిన ట్రాక్టర్ యజమానులకు డబ్బులు చెల్లించకపోవడంతో రహదారిని మధ్యలో తవ్వి నిరసన తెలిపారనే ప్రచారం

అసైన్డ్ భూముల నుంచి పరిశ్రమలకు మట్టి!

గొల్లపల్లి శివారు సర్వే నంబర్ 75లోని అసైన్డ్ భూముల నుంచి కొంతకాలంగా రాత్రివేళల్లో మట్టిని తవ్వి పరిశ్రమలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి అవసరాలకు, పొలాలకు వెళ్లేందుకు రహదారులు వేసుకుంటున్నామని అధికారులకు చెబుతూ, వాస్తవానికి మట్టిని లారీల ద్వారా బయటకు తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

మునిదేవునిపల్లి భూములపై

మునిదేవునిపల్లి శివారులోని సర్వే నంబర్ 92లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూముల నుంచి సైతం వెంచర్లకు రాత్రివేళల్లో మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలోని పలు ప్రాంతాల్లో వెంచర్లు, పరిశ్రమలు ఏర్పాటవుతున్న నేపథ్యంలో మట్టి వ్యాపారం జోరుగా సాగుతోందని స్థానికులు చెబుతున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏది?

మట్టి తరలింపులో అధికార, ప్రతిపక్షాలకు చెందిన కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ పలుకుబడిని ఉపయోగించుకుని అనుమతుల విషయంలో అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.మండలంలో ఎక్కడెక్కడ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి? ఏ సర్వే నంబర్లలో అనుమతులు ఉన్నాయి? మైనింగ్ అనుమతులు రాయి వరకే పరిమితమా? మట్టి తరలింపునకు రెవెన్యూ, గనుల శాఖల అనుమతులు తీసుకున్నారా? రాత్రివేళల్లో తరలిస్తున్న మట్టి వాహనాలకు రవాణా అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ, అసైన్డ్ భూముల నుంచి మట్టి తరలింపుపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?రైతుల భూముల నుంచి మట్టి మాయమవుతుంటే.. పర్యవేక్షించాల్సిన యంత్రాంగం ఏం చేస్తోంది? అన్న ప్రశ్నలు మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, అక్రమ తవ్వకాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రీధర్ బాబుతోనే గ్రామాల అభివృద్ధి.

కమాన్ పూర్ తెలంగాణ మంజీరా అక్టోబర్ 30.

రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తోనే గ్రామాల అభివృద్ధి చెందుతుందని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు అన్నారు. కమాన్ పూర్ మండలం గుండారం గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం మంజూరి పత్రాలను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా అన్వర్ మాట్లాడుతూ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు గుండారం గ్రామంలో ఏడుగురికి ఇందిరమ్మ గృహాలు మంజూరయ్యాయని అలాగే మరికొంత మంది నిరుపేదలను గుర్తించి వారికి గృహాలు అందజేయడమే ప్రధమ ధ్యేయమని అన్నారు. శ్రీధర్ బాబు తోనే గ్రామాల అభివృద్ధి చెందుతుందని ఇందులో భాగంగా కమాన్ పూర్ మండలంలో అంతర్గత రోడ్లు గ్రామపంచాయతీ భవనాలు వైకుంఠ రథాలు ఎన్నో ఇటీవల అందజేయడం జరిగిందని అన్వర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుండారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిడుగు శంకర్, కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్,ఉప సర్పంచ్ అంబిరి రాజేందర్, మాజీ సర్పంచు పిడుగు నరసయ్య, వార్డు సభ్యులు దామెర దేవయ్య పిడుగు ఎల్ఐసి సది, నాయకులు ముకుంద శ్రవణ్, వడ్లకొండ శంకర్, ఆకుల వెంకటేష్, ఆకుల రమేష్, ముధం కొమురయ్య, ముదాం రాములు, రాచకొండ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే సహస్ర ఆసుపత్రి లక్ష్యం..!

ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, క్యాంటీన్, డయాలసిస్ విభాగాల ప్రారంభం

పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం

ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ రాజు గౌడ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

పట్టణంలోని సహస్ర ఆసుపత్రిలో మరో కీలక ముందడుగు పడింది. పేద, మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆరోగ్యశ్రీ వార్డు, ఈహెచ్ఎస్ సేవలు, క్యాంటీన్, డయాలసిస్ విభాగాలను ఆసుపత్రి యాజమాన్యం శుక్రవారం ప్రారంభించింది. ఈ విభాగాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రముఖులు హాజరయ్యారు. ఆరోగ్యశ్రీ ద్వారా అర్హులైన పేదలకు వైద్య సేవలు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ పథకం ద్వారా వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. అదేవిధంగా డయాలసిస్ అవసరమైన రోగులకు ప్రత్యేక సేవలు, రోగులు, వారి సహాయకుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ కె. రాజు గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ రక్షణ సేన (తెరాస) దళిత వింగ్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా చంటి శ్రీనివాస్ నియామకం

కరీంనగర్ అక్టోబర్ 30 తెలంగాణ మంజీరా

తెలంగాణ రక్షణ సేన (తెరాస) పార్టీ కరీంనగర్ జిల్లా అనుబంధ విభాగాల కమిటీని పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు గౌరవనీయులు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ప్రకటించడం జరిగింది. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా దళిత వింగ్ (డిస్ట్రిక్ట్ డిలీట్ వింగ్) అధ్యక్షుడిగా చంటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడు చంటి శ్రీనివాస్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు, పార్టీ అగ్రనాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో దళిత సామాజిక వర్గాల హక్కుల కోసం, వారి సంక్షేమం కోసం తెలంగాణ రక్షణ సేన తరపున నిరంతరం శ్రమిస్తానని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ఆశయాల సాధనకు శ్రేణులను ఏకోన్ముఖం చేస్తూ ముందుకు సాగుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.చంటి శ్రీనివాస్ నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు దళిత సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

నీరును తోడేస్తున్నాం... సిరిలేరు మాకేవరు..!

ఒక వైపు తాగు తప్పని నీటి తిప్పలు..!

నీళ్ల ట్యాంకర్ల జోరు... మహా ప్రబో అంటున్న ప్రజలు..!

ట్యాంకర్లపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు..?

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో రోజు రోజుకు మంచి నీటి సమస్య వేడెక్కుతుంది. ఒకవైపు తాగునీటి సమస్య... మరో వైపు నీళ్ల ట్యాంకర్ల జోరు దందా... ? చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తారు. ప్రజలు నీటి దాహం తీర్చండి మహా ప్రబో అంటే ... జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం కంది మండల పరిధిలోని కాశీంపూర్ గ్రామ శివారులో నీళ్ల ట్యాంకర్లను నీళ్లు నింపుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఈ విషయంపై జిల్లా స్థాయి అధికారులు ఏలా స్పందిస్తారో అప్పటి వరకు వేచి చూడాల్సిందే..?

క్రీడల్లో అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ అక్టోబర్ 30 తెలంగాణ మంజీరా

అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతున్నారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి తెలిపారు. కొత్తపల్లిలోని కళాశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. క్రీడలు విద్యార్థులకు శారీరక దృఢత్వంతో పాటు ఒత్తిడి తగ్గించి, ఏకాగ్రతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పెద్దపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి ఉషు పోటీల్లో కే. స్నితిక 45 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించి, జమ్మూ కాశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైంది. అలాగే జిల్లా స్థాయి అండర్-19 పోటీల్లో వాలీబాల్‌లో ఎస్. చక్రిత, ఖో-ఖోలో ఎం. కార్తీక, టేబుల్ టెన్నిస్‌లో ఏ. మనస్వి, హాకీలో కే. స్నితిక, వి. అక్షర, కె. సాక్షర, ఏ. ఆశ్రిత, బాస్కెట్‌బాల్‌లో రమ్యశ్రీ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విజేతలను నరేందర్ రెడ్డి అభినందించి, రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోపాల్ రావు పేట రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం:

రామడుగు: తెలంగాణ మంజీరా

రామడుగు మండలం గోపాల్ రావుపేట రైతు వేదికలో వ్యవసాయ శాఖ మరియు కేవీక్ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం ద్వారా నేల ఆరోగ్య పరిరక్షణ పైన రైతులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా కేవీకే శాస్త్రవేత్త వేణుగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ ఎంతో ముఖ్యమని భూసారం తగ్గకుండా భవిష్యత్ తరాలకు సైతం ఆరోగ్యకరమైన నేలను అందించాల్సిన బాధ్యత ప్రతి రైతుపై ఉందని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని నేల పరీక్షల ఆధారంగా సమతుల్యంగా చేపట్టాలని సేంద్రియ ఎరువులు పచ్చిరొట్ట ఎరువులు జీవ ఎరువుల వినియోగాన్ని పెంచాలని సూచించారు.పంటల మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా నేలలో పోషక సమతుల్యతను కాపాడుకోవచ్చని రైతులకు వివరించారు.అదేవిధంగా నేలలో తేమను సంరక్షించడానికి మల్చింగ్ పద్ధతిని అవలంబించాలని పంట అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా సేంద్రియ కర్బన శాతాన్ని పెంచుకోవచ్చని సూచించారు. వ్యవసాయంలో అధిక రసాయనాల వినియోగం వల్ల నేల ఆరోగ్యంపై కలిగే దుష్ప్రభావాలను వివరించి ప్రకృతి అనుకూల వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని రైతులకు అవగాహన కల్పించారు.నేల ఆరోగ్యమే రైతు ఆర్థిక అభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు.రైతు లు ఉద్యాన వన పంటలైన పామ్ ఆయిల్ కూరగాయల సాగుకు మొగ్గుచూపాలని వారు తెలిపారు. అనంతరం ఏడీఏ చొప్పదండి ఎన్.ప్రియదర్శిని మాట్లాడుతూ రైతులు వ్యక్తిగతంగా పంటల సాగుతో పాటు రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్ పిఓఎస్)లో భాగస్వాములు కావాలని సూచించారు. ఎఫ్‌పీఓల ద్వారా వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ నిల్వ ప్రాసెసింగ్ మార్కెటింగ్ వంటి సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని తద్వారా రైతులు తమ ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు మరియు గిట్టుబాటు ధరలు పొందవచ్చని వివరించారు.ప్రస్తుత వాతావరణ పరిస్థితులు ఎల్‌నినో ప్రభావం వర్షపాతం లోటు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు.నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ నీటితో పండించే ప్రత్యామ్నాయ పంటలైన మొక్కజొన్న పెసర మినుము వేరుశెనగ ప్రొద్దుతిరుగుడు నువ్వులు తదితర పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల ఎంపిక విత్తనాల ఎంపిక చేపట్టాలని వారు కోరారు.వ్యవసాయంలో దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నేల ఆరోగ్య పరిరక్షణ నీటి పొదుపు పంటల వైవిధ్యీకరణ సేంద్రియ వ్యవసాయం వంటి పద్ధతులను రైతులు ఆచరణలో పెట్టాలని సూచించారు.ఈ

సందర్భంగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం 24వ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులకు చూపించారు.కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం రైతులకు పెట్టుబడి అవసరాల సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఈ మొత్తాన్ని విత్తనాలు ఎరువులు మరియు ఇతర వ్యవసాయ అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎం.ప్రభావతి ఏఈఓ అనంతరాజు గుండి గ్రామ సర్పంచ్ మల్లేశం రామచంద్రాపూర్ గ్రామ సర్పంచ్ రాజేష్ పాక్స్ డైరెక్టర్ మల్లారెడ్డి స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఘనంగా స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్

450 మంది విద్యార్థులు.. 140 ప్రాజెక్టుల ప్రదర్శన

కరీంనగర్ అక్టోబర్ 30 తెలంగాణ మంజీరా

హనుమాన్ నగర్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, ఈవీఎస్ సబ్జెక్టులకు సంబంధించి 140 ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల్లో పండుగలు, సంస్కృతి, ప్రకృతి, మొక్కల ఉపయోగాలు, జ్ఞానేంద్రియాలు, ఆరోగ్యకరమైన ఆహారం, భిన్నాలు, త్రిభుజాలు వంటి అంశాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు తమ ప్రాజెక్టుల గురించి స్వయంగా వివరిస్తూ, సందర్శకుల ప్రశ్నలకు ఆత్మవిశ్వాసంతో సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జంగా సునీత మనోహర్ రెడ్డి ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, తార్కిక ఆలోచన, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కార్యక్రమం విజయవంతంగా సాగింది.